నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
శుక్రవారం 25 ఆగస్టు 2023

ఆయుష్ ఆధర్వంలో కరపత్రాలు పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి

ఆయుష్ విభాగ వైద్యాధికారి ప్రేమలత ఆధ్వర్యంలో పోతంగల్ ప్రైమరీ పాఠశాలను గురువారం సందర్శించి పిల్లలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. చిన్న చిన్న సమస్యలున్నవారికి ఆయుర్వేదిక్ మందులను పంపిణీ చేశారు. పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లు, పోషకహారం లోపంతో ఉన్న పిల్లలకు కౌన్సెలింగ్ చేసి, ఆకుకూరలు ఎక్కువగా తినాలని తెలియజేశారు. అనంతరం ఆయుష్ విభాగానికి సంబంధించిన కరదీపికలను, పిల్లలకు ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, ఆయుష్ విభాగం ఫార్మసిస్ట్ పురుషోత్తం, స్థానిక ఆరోగ్య కార్యకర్త గౌరీదేవి, పాఠశాల హెడ్‌మాస్టర్ జ్యోతి, ఉపాధ్యాయులు స్రవంతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రభాస్ యోజనలో పండరిపూర్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రభాస్ యోజన కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నీల రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పండరీపూర్ ఎమ్మెల్యే సమాధాన్ మహాదేవ్ ఔతాడే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త పనిచేసి బోధన్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డీ మోహన్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, శ్యాంసుందర్, ఎంపీపీ లోలపు రజిని కిషోర్, జడ్పిటిసి మేక విజయ సంతోష్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, మండల ఉపాధ్యక్షులు ఖ్యాతం యోగేష్, మండల అధ్యక్షులు గోపికృష్ణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, శక్తి కేంద్రం ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

అనువైన భవనాల వివరాలు తెలపాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- సి.ఎం.సి కళాశాల పరిశీలన


సీఎంసీ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఎన్నికల నిర్వహణ సాఫీగా జరిగేలా అన్ని వసతులతో కూడిన భవన సముదాయాన్ని గుర్తించి ఎన్నికల సంఘానికి వివరాలు పంపించాల్సి ఉందని, ఈ మేరకు అందుబాటులో ఉన్న మరికొన్ని కళాశాలలు, ఇతర కార్యాలయాల భవనాలను పరిశీలించి తనకు పూర్తి వివరాలు తెలియజేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్‌ను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సి.ఎం.సి మెడికల్ కళాశాలలను పరిశీలించారు. గత ఐదేళ్ల క్రితం జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో సీఎంసీలోనే ఓట్ల లెక్కింపు చేపట్టామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. త్వరలో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటికి అనువుగా ఉన్న కేంద్రాలు ఏవీ అన్న వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాల గురించి తనవెంట ఉన్న అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, డీసీపీ జయరాం తదితరులతో ప్రాథమికంగా చర్చించారు.

ఖిల్లా ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్..

జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు. ఒకే ప్రాంగణంలో మూడు పాఠశాలలు కొనసాగుతుండడంతో తరగతి గదుల కొరత నెలకొని ఉండడాన్ని గమనించిన కలెక్టర్, అడిషనల్ క్లాస్ రూమ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికే మన ఊరు - మన బడి కింద మంజూరైన పనులకు సంబంధించి ప్రస్తుతం అవి ఏ దశలో కొనసాగుతున్నాయన్నది పరిశీలించారు. నీటి కొరత ఉందని ఉపాధ్యాయులు తెలుపగా, బోరు బావిని మరమ్మతులు చేయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తిస్తూ, అదనపు గదుల నిర్మాణానికి సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, మున్సిపల్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు ఉన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేదలపై భారాలు మోపే బీజేపీని, ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిన బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపునిచ్చారు. గురువారం నిజామాబాద్ నగరంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ఏ.రమేష్‌బాబు మాట్లాడుతూ.. పేదలపై నిత్యావసర సరుకుల భారాలను మోపుతూ గ్రామీణ పేదలకు ఉపాధి హామీ నిధులను తగ్గించి ఉపాధి హామీని దెబ్బతీసే విధంగా చేస్తున్న బీజేపీని రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. పేదలపై భారాలను మోపటమే కాక ప్రజాధనాన్ని కొద్దిమంది వ్యక్తులకు కట్టబెడుతూ కోటీశ్వరులను శతకోటీశ్వరులుగా మారుస్తున్న విధానాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతూ మత ఉద్రిక్తతలను సృష్టించి ఓట్లుపొంది రాజకీయంగా లాభం పొందాలని చూస్తోందన్నారు. మతతత్వ విధానాలను అవలంభిస్తున్నారని, దీని మూలంగా ప్రజల్లో ఐక్యత దెబ్బతిని సమస్యలు పక్కదోవ పట్టే ప్రమాదం ఉన్నదని ఆయన అన్నారు. మరొకవైపు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమం సందర్భంగా వచ్చిన తర్వాత పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని ఉపాధి అవకాశాలను పెంచుతామని హామీ ఇచ్చి వాటిని అమలు చేయలేదన్నారు. మరొకసారి ప్రజలను మభ్యపెట్టటానికి దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు పేర్లతో కొద్దిమందికి రుణాలను ఇచ్చి మిగతా వారికి ఆశపెట్టి ఓట్లు పొందాలని తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత వాటిని కూడా పక్కకు పెట్టాలని చూస్తున్నారని, మరొకవైపు బీజేపీతో లోపాయికారి ఒప్పందాలను చేసుకొని ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ రెండు ప్రభుత్వాలను ప్రజలు రాబోయే ఎన్నికల్లో ఓడించినప్పుడే పేదలకు, నిరుద్యోగులకు రక్షణ లభిస్తుందని వారు అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకట్రాములు, రాఘవులు, చక్రపాణి, వై.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జుక్కల్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి 'అయ్యాల సంతోష్' దరఖాస్తు


దరఖాస్తు అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పిట్లం

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల దరఖాస్తుల ప్రక్రియలో భాగంగా జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అయ్యాల సంతోష్ అభ్యర్థిత్వానికి గానూ ఆయన అనుచరులు సాయిప్రసాద్, మహేష్, సంజీవ్‌లు గాంధీభవన్‌లో బుధవారం దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఎస్ఆర్ ఫౌండేషన్ స్థాపించి నియోజకవర్గంలోని పలు మండలాల, గ్రామాలలో అనేక సేవ కార్యక్రమాలతో పాటు నిరుద్యోగులకు ఎస్సై, కానిస్టేబుల్, తదితర పోటీ పరీక్షలలో స్థాయి, సామర్థ్యాల పరీక్షలు నిర్వహించి తోడ్పాటు నందించిన ఘనత ఆయన సొంత మన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలే అడుగుజాడల్లో పయనిస్తూ బహుజనుల శ్రేయస్సే తమ ధ్యేయంగా నిరంతరం పాటుపడుతూ అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక కార్యకర్తగా సేవలందిస్తున్నందుకుగానూ ఆయనకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్టును ఖరారు చేయాలని వారు కోరారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొననున్న హెూం శాఖ మంత్రి, స్పీకర్


మాట్లాడుతున్న పోచారం సురేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో శుక్రవారం, శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలలో బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు, సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర హెూంశాఖ మంత్రి మహమూద్ అలీ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొంటారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఏడు కోట్ల రూపాయలతో మైనార్టీ పాఠశాలను శనివారం రాష్ట్ర హెూంశాఖ మంత్రి ప్రారంభిస్తారని, శుక్రవారం మండల కేంద్రంలోని పలు అభివృద్ధి పనులను పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ మున్నూరు కాపు కుల సంఘం కమ్యూనిటీ భవనం నిర్మాణానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి కృషితో ఎంపీ అరవింద్ నిధులు మంజూరు చేశారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ తన ఎంపీలాడ్స్ నిధుల నుండి రూ.4లక్షల 50వేలు మంజూరు చేశారు. ఆ నిధుల మంజూరు పత్రాన్ని చౌట్ పల్లిలోని తన స్వగృహంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి చేతుల మీదుగా మున్నూరు కాపు కుల సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రమేష్ రెడ్డి, రంజిత్, బోనగిరి శంకర్, కొమ్ముల అశోక్, అవారి గంగారాం, గడ్డం రాజు, మున్నూరు కాపు సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్, బషీరాబాద్ గ్రామాల్లో గురువారం పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో హసకొత్తూర్ గ్రామానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు, బషీరాబాద్ గ్రామానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చెక్కులను మంజూరు చేసింది. బషీరాబాద్‌లో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బైకని మహేష్, సర్పంచ్ సక్కారం అశోక్, సీనియర్ నాయకులు బోడ దేవేందర్, నర్రా మోహన్, నెల్ల రమేష్, లక్ష్మి నర్సయ్య, నడిమొల్ల రాజు, విక్రమ్, పెద్ది దిలీప్, శ్రీనివాస్, హస కొత్తూర్‌లో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తెడ్డు కిరీటి పాల్గొన్నారు.

18 ఏండ్లు నిండితే ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలి

- బోధన్ ఆర్డీవో రాజగౌడ్


మాట్లాడుతున్న బోధన్ ఆర్డీవో రాజగౌడ్

నవతెలంగాణ-ఎడపల్లి

స్థానిక సంస్థలు (అసెంబ్లీ) ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బూత్ లెవెల్ స్థాయి అధికారులు గ్రామాలలోని 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు ఓటర్ నమోదు తప్పకుండా చేయించుకునేలా అవగాహన కల్పించాలని బోధన్ ఆర్డీవో రాజగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. కొత్తగా ఓటర్ నమోదు చేసుకోవడానికి యువతి యువకులు ఫారం 6లో బీఎల్‌వోల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ లిస్టులో పేర్లు ఉండి ఫోటోలు కానీ, ఇంటి మారుపేరు కానీ, పేరు కానీ తప్పులు ఉంటే సవరించుకునేందుకు ఫామ్ 7లో నింపాలన్నారు. అలాగే స్థానిక గ్రామస్తులు గ్రామంలో ఓటర్ కార్డు ఉండగా ఇతర గ్రామాలలో జీవనోపాధి కోసం వలసకు వెళితే అక్కడ కూడా వారికి ఓటర్ ఐడి కార్డు ఉందా లేదా అని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో కీలకమన్నారు. గ్రామస్థాయిలో బూత్ లెవెల్ స్థాయి అధికారులు తడబడకుండా ఓటర్ జాబితాను సక్రమంగా సరిచేసి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో సకాలంలో అందజేయాలని ఆయన ఆదేశించారు. ఎడపల్లి తహసీల్దార్ మోతీ సింగ్, ఎంపీడీవో గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల రుణాలు రికవరీ చేయాలి

నవతెలంగాణ-బోధన్

మహిళ సంఘాల ఆర్థిక అభివృద్ధికి మంజూరి చేసిన రుణాలు పూర్తిగా చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని ఐకేపీ ఏపీఎం వినోద్ కుమార్ అన్నారు. గురువారం బోధన్ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2023-24 సంవత్సరానికి 577 సంఘాలు బ్యాంక్ లింకేజీ టార్గెట్ పూర్తిచేయడంతో రూ.3064.35 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు 226 సంఘాలకు రూ.1139.81 లక్షల ప్రగతి సాధించినట్లు తెలిపారు. అలాగే 320 న్యూ ఎంటర్ ప్రైజెస్ వ్యాపారాలు ఏర్పాటు చేయడానికి సంఘం సభ్యులను గుర్తించారు. గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాలన్నీ ఏ, బీ గ్రేడ్ పురోగతి సాధిం చాలని సూచించారు. బ్యాంక్ లింకేజి, గ్రామ సంఘాల రుణా లు 100శాతం రికవరీ చేపట్టా లని సూచించారు. ప్రతి నెల సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించి, సభ్యులకు బీమా చేయించాలని సంఘం సభ్యు లకు సూచించారు. మండల సమాఖ్య నుంచి ఖాజాపూర్ గ్రామ సంఘానికి 2 లక్షలు రుణం మంజూరి చేశారు. సంఘం ప్రతినిధులు ఖైరున్నీసా, ఆడిటర్ మాధవరావు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పద్మావతి

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త


అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ రాములు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ఏఎస్ఐ రాములు, పోలీస్ సిబ్బంది సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోందన్నారు. మహిళలు, పిల్లలే లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడుతూ వివిధ రకాల వేధింపులకు గురిచేస్తున్నారని వివరించారు. ఆన్‌లైన్లో ఎన్నో రకాల యాప్‌ల ద్వారా వివిధ షాపింగ్‌లు, ఉద్యోగాలు, లావాదేవీలు తదితర అవసరాల నిమిత్తం విరివిగా ఆన్‌లైన్ సేవలను వినియోగించడం పెరిగిందన్నారు. దీన్ని ఆసరా చేసుకొని సైబర్ నేరస్తులు లోన్లు ఇస్తామని, తక్కువ ధరకు వస్తువులు, వాహనాలు ఇస్తామని చెప్పి డేటా సేకరించి బ్యాంకుల్లో ఉన్న నగదును కాజేసి తిరిగి వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేరాల బారిన పడకుండా పోలీస్‌శాఖ సైబర్ కాంగ్రెస్, ఉమెన్ సేఫ్టీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు.

విద్యా వ్యవస్థల్లో ఆన్‌లైన్ భద్రత కల్పించడంతో పాటు సైబర్ నేరాలను నియంత్రించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాలు నియంత్రించడంలో ఉపాధ్యాయులు తమవంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కండరావు పటేల్, సొసైటీ డైరెక్టర్ సాయగౌడ్, ప్రేమ్‌సింగ్, సంతోష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తీజ్ పండుగలో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి



మండలంలోని కన్నపూర్ తండాలో గిరిజనులు తీజ్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. తీజ్ పండగలో కాంగ్రెస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తాండాకు సంబంధించిన 20 మంది తాండవాసులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. తీజ్ పండగ సర్పంచ్ చంద్ర నాయక్, ఉప సర్పంచ్ శర్మ నాయక్, తాండపెద్దలు దగ్గరుండి నిర్వహించారు. గిరిజన నృత్యాలతో, బుట్టలతో ఆడపడుచులు కనువిందు చేశారు.

ఎల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నాగిరెడ్డిపేట్ మండలం మాల్తుమ్మెద గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన యువకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

కృష్ణాజివాడిలో మేక దొంగతనం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో మేకను మరుపల్లి ఎల్లయ్య పశువుల కొట్టం వద్ద దొంగతనం చేసి కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో దొంగిలించి విక్రయిస్తుండగా, కొనుగోలు చేసే వ్యక్తికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. మేకను దొంగిలించిన దుండగులు తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన వేణు, అనిల్‌గా గుర్తించారు. వేణు, అనిల్ బుధవారం రాత్రి సమయంలో బైక్ పైన వచ్చి కృష్ణాజివాడి గ్రామంలో మేకను దొంగిలించారు. అనంతరం మేకను బైక్‌పై తీసుకువెళ్లి పాత బస్టాండ్‌లో తక్కువ ధరకు విక్రయించేందుకు ప్రయత్నం చేశారు. దీంతో కొనుగోలు చేసే వ్యక్తికి అనుమానం వచ్చి మేకను తీసుకు వచ్చిన వేణు, అనిల్‌ను ఆరా తీశాడు. దీంతో మేకను కృష్ణాజివాడలో దొంగిలించినట్లు వేణు, అనిల్ ఒప్పుకోవడంతో స్థానికులు చితకబాదారు. అనంతరం మేక దొంగలను స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించారు. ఎల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-రామారెడ్డి

అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన చిదుర ప్రకాష్ ఇంట్లో అక్రమ పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించగా, ఇంట్లో 18 ప్లాస్టిక్ బస్తాల బియ్యం అక్రమంగా నిల్వ ఉంచగా, డిటి వై.కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

దొంగలను పట్టుకున్న హోంగార్డుకు ప్రశంస

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని గత రెండు మూడు రోజులగా వరుసగా దొంగతనాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో హోంగార్డు గోరి ప్రత్యేక నిఘా వేసి దొంగలను పట్టుకున్నందుకు గానూ జిల్లా ఎస్పి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంస పత్రం అందజేసి అభినందించినట్టు ఎస్ఐ కోనారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఎస్ఐ కోణారెడ్డి తదితరులున్నారు.

సర్పంచ్‌ను పరామర్శించిన జడ్పీటీసీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని జనగామ సర్పంచ్ మొలిగే శంకర్‌ను జడ్పీటీసీ కమిలి నర్సింలు గురువారం పరమర్శించారు. బుధవారం రాత్రి సర్పంచ్ ఇల్లు కూలిపోవడంతో ఈ విషయం తెలిసిన వెంటనే ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జడ్పీటీసీ తహశీల్దార్‌కు సమాచారం అందించగా తహసీల్దార్ కార్యాలయం నుంచి జూనియర్ అసిస్టెంట్‌ను, రికార్డు అసిస్టెంట్‌ను పంపించారు. వారు ఇల్లును పరిశీలించి పూర్తి వివరాలను సేకరించారు. ఆయన వెంట ఎం.పి.టి.సి పాపనోల్ల బీరయ్య, బీఆర్ఎస్ నాయకులు గైని రమేష్, సుభాష్‌రావు, బల్వంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

యాద్గార్‌పూర్‌లో ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో కోటగిరి సంజీవని హాస్పిటల్ వారిచే ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన బర్ల మధు సహకారంతో గ్రామంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాల నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ మిర్జాపూర్ విజయలక్ష్మి సాయన్న తెలిపారు.

ఓటర్ నమోదు త్వరగా చేపట్టాలి

నవతెలంగాణ-దోమకొండ

ఓటర్ నమోదు త్వరగా చేపట్టాలని తహసీల్దార్ సంజయ్‌రావు అన్నారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బీయల్‌వోలతో ఓటర్ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంజయ్ రావు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోని 18 ఏళ్ల వయస్సు ఉన్న వారికీ ఓటర్ నమోదు చేయాలని, ఓటర్ జాబితాలో ఏవైనా వివరాలు తప్పుగా ఉంటే వారికి సవరణల కోసం దరఖాస్తులు స్వీకరించాలని ఓటర్ జాబితాను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఆర్ఐ మహేందర్, సిబ్బంది, బీయల్‌వోలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షకీల్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థిగా బి.ఆర్.ఎస్ పార్టీ నుంచి మూడోసారి సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌ను ప్రకటించడంతో గురువారం బోధన్ మండలానికి చెందిన పలువురు నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సాలూరా సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, నాయకులు గణేష్ పటేల్, మజార్ అలీ, ఖదీర్, సరిడే సాయిలు, సురేష్ పటేల్, బండారుపల్లి సాయిలు, వినోద్ నాయక్ తదితరులున్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
2
శుక్రవారం 25 ఆగస్టు 2023

ప్రాంతీయ సమన్వయాధికారి బదిలీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాలయాల ప్రాంతీయ సమన్వయాధికారి (నిజామాబాద్) కె. అలివేలు తిరిగి నిజామాబాద్ రీజియన్కు కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఇదే స్థానంలో ఇంతకు ముందు పని చేసిన మేరీ మేసుపాదం ప్రాంతీయ సమన్వయాధి కారిని కరీంనగర్ రీజియన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కె. అలివేలు గురువారం నిజామాబాద్ రీజియన్ కు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు విద్యాలయాల్లో విద్యార్థుల ప్రవేశాలు, ఫలితాలు, ఆహారం, పరిశుభ్రత మొదలైన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మెరి యేసుపాదం వీడ్కోలు, కె. అలివేలు కి స్వాగత సమావేశం ఏర్పాటు చేసి ఇద్దరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిజామా బాద్ రీజియన్ ప్రిన్సిపాల్ శివరాం, నలిని, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సూపరిండెండెంట్ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ జాగృతి కమిటీల ఎన్నిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనాచారి జిల్లా అధ్యక్షులు అవంతి సూచనల మేరకు డిచ్ పల్లి మండల గ్రామ జాగృతి కమిటీలను గురువారం ఎన్నుకున్నారు. డిచ్‌పల్లి గ్రామ కన్వీనర్‌గా నవీన్, కోకన్వీనర్‌గా రాజన్న, రాంపూర్ గ్రామ కన్వీనర్‌గా శంకర్, మిట్టాపల్లి కన్వీనర్‌గా ప్రశాంత్, కోకన్వీనర్‌గా రవితేజ, మిట్టాపల్లి తండా కన్వీనర్‌గా నామ్ దేవ్ నాయక్, కోకన్వీనర్‌గా క్రిష్ణనాయక్, రూరల్ నియోజకవర్గ కన్వీనర్‌గా మల్లెల సాయిచరణ్‌కు నియామక పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో రూరల్ యూత్ కన్వీనర్ సంతోష్ నాయక్, కోకన్వీనర్ గుడ్డేటి విక్కీ, మండల కన్వీనర్ భాస్కర్ ఇందల్వాయి మండల కన్వీనర్ బొడ్డు గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

- ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- కార్యదర్శులకు ఆర్డర్ కాపీలు అందజేత


డిచ్‌పల్లి : జేపీఎస్‌లకు ఆర్డర్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ఇంద్రాన్‌పల్లి/మోపాల్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రెగ్యులరైజేషన్ పత్రాలను అందజేశారు. గురువారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిచ్ పల్లి మండలానికి చెందిన 24 మంది జేపీఎస్ లకు, ఇందల్ వాయి మండలంలోని 9మంది జెపిఎస్‌లకు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రెగ్యులరైజేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . కార్యదర్శులు చేసిన కృషితోనే రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులు సాధించినట్లు తెలిపారు. ఇలాగే భవిష్యత్తులో మరింత బాధ్యతగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో జయసుధ, డీఎల్పీవో నాగరాజు, ఎంపీడీవో గోపిబాబు, రాములు నాయక్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, రాజ్ కాంత్ రావు, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, దాసరి ఇందిర లక్ష్మినర్సయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చింత శ్రీనివాస్ రెడ్డి,సినియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రాన్‌పల్లి :మండలంలోని 15 మంది జేపీఎస్ (గ్రామ పంచాయతీ సెక్రెటరీ) ఉద్యోగులకు అలాట్ మెంట్ ఆర్డర్స్ పత్రాలను తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం అందజేశారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అయితే 5000 రూపాయలు పంచాయతీ సెక్రెటరీకి ఇస్తున్నారని, కష్టాన్ని గుర్తించి సాలరీ పెంచి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దని అన్నారు. కష్టపడి గ్రామాన్ని ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్ద వలసిన బాధ్యత ఉందని సూచించారు. నాలుగేండ్ల సర్వీస్ పూర్తి అయిన జేపీఎస్‌లను గ్రేడ్-4 కార్యదర్శులుగా రెగ్యులర్ చేస్తూ పదోన్నతి కల్పిస్తుందని తెలిపారు. పల్లె ప్రగతిలో వారి పనితీరును లెక్కించి 70 శాతం మార్కులు సాధించిన వారికి తొలివిడుతగా అలాట్ మెంట్ ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువ నాయకులు జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు ధర్పల్లి జెడ్పిటిసి జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్, డిపిఓ జయసుధ, డిఎల్‌పిఓ నాగరాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలో 15 మంది జూనియర్ పంచాయతీ సెక్రటరీలు ఉండగా అందులో 9 మందికి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మీదగా ఆర్డర్ కాపీలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో రోజుల నుండి ఎదురుచూస్తున్న పంచాయతీ కార్యదర్శుల కోరిక నెరవేరిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబల్లి దయాకర్, బాజిరెడ్డి గోవర్ధన్‌కు ధన్యవాదాలు తెలిపారు. మిగతా వారిని కూడా రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్, మోపాల్ జడ్పిటిసి కమలా నరేష్, ఎంపీడీవో లింగం నాయక్, ఎంపీ ఓ ఇక్బాల్ పాల్గొన్నారు.


ఆర్డర్ కాపీలు తీసుకున్న మోపాల్ మండల జూనియర్ కార్యదర్శులు

డిగ్రీలో మొదటి సంవత్సరం దోస్త్ స్పెషల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

2023-2024 విద్యా సంవత్సరం నుండి డిచ్ పల్లి మండల కేంద్రంలోని సిఎండిలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకునే విద్యార్థులు దోస్త్ స్పెషల్ డ్రైవ్ రూస్ ఆన్లైన్‌లో అప్లయి చేసుకోవాలని డిగ్రీ కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ పి రాంమోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28- నుండి ప్రారంభమయ్యే స్పెషల్ ఫేజ్ లో విద్యార్థులు సిఎం, సిబిసి ఎస్ ఇంగ్లీష్, బికాం, బిబిసి ఎస్ ఇంగ్లీష్, బి.ఎస్సి (లైఫ్ సైన్సెస్) సిబి సిఎస్ ఇంగ్లీష్, బిఎస్సి (ఫిజికల్ సైన్స్), సిబిసిఎస్ ఇంగ్లీష్ కోర్సులలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతీ కోర్సులో 60 సీట్లు ఉంటాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

మహిళలపై బిజెపి దాడులు మానుకోవాలి

- కాలం చెల్లిన మూస పద్ధతిలో మహిళలను అవమానించడం తగదు
- అవహేళనలు ఆపి... మహిళా బిల్లు ఆమోదానికి కృషి చేయండి
- ట్విట్టర్లో బిజెపికి కల్వకుంట్ల కవిత హితవు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహిళలపై దాడి చేయడం ఆపాలని బిజెపికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. మహిళల గురించి తప్పుడు వ్యాఖ్యానాలతో అవహేళన చేయడం మానుకోవాలని స్పష్టం చేశారు. ట్విట్టర్లో గురువారం తెలంగాణ బిజెపి చేసిన ఓ ట్వీట్ పై ఘాటుగా స్పందించారు. కాలంచెల్లిన మూస పద్ధతిలో మహిళలలో అవహేళన చేయడం తగదని స్పష్టం చేశారు. మహిళలు ఉన్నత స్థానానికి చేరుకోవడం బిజెపి ఓర్వలేక పోతుందా.. అని అడిగారు.మహిళ హక్కుల గురించి మాట్లాడుతున్న వారి గొంతు నొక్కడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఇతరులపై నిందలు వేయడం మానుకొని పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడానికి కృషి చేయాలని బిజెపిని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-భీంగల్


శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధి

మండలంలోని బాచన్‌పల్లి గ్రామంలో మున్నూరు కాపు సంఘంకు 5 లక్షలు, సీనియర్ సిటీజన్స్ సంఘంకు 5 లక్షలు, పల్లికొండ గ్రామంలో సీనియర్ సిటిజన్ సంఘంకు 5లక్షలు పురాణిపేట్ లో నకాసి సంఘ భవనానికి 6 లక్షలు, బాబానగర్ కాలనీ బిసి సంఘ కు 6 లక్షలు, జాగిర్యాల్ లో కుర్మ సంఘంకు 4 లక్షలు, పల్లికొండలో 4 లక్షల సిసి రోడ్డు, బీరప్ప గుడి వద్ద బోరు, మోటారు 4 లక్షలు పనులకు గురువారం శంకుస్థాపనలు చేశారు. కార్యక్రంలో ఎంపిపి ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య , సర్పంచ్‌లు, యంపిటీసి శంకుస్థాపనలు చేశారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ న్యాయస్థానం బార్ అసోసియేషన్తో చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్న రెడ్డి అధ్యక్షతన గురువారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా యవాదులకు హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్న రెడ్డి, ఉపాధ్యక్షుడు సెరియల జగన్, ప్రధాన కార్యదర్శి ఐనారి అశోక్, ట్రెజరర్ అరుణ్, గ్రంథాలయ కార్యదర్శి తుమ్మ సుకేష్ , సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన విడిసి సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వీడీసీ

మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ రమేష్ ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సర్పంచ్ సక్కరం అశోక్ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసి బాధ్యతలు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్, ఆర్ఐ శరత్ కుమార్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆకుల బాజన్న, కార్యదర్శి గంగారాం, సదరు అల్లకొండ గంగాధర్, గ్రామ అభివృద్ధి కమిటీ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు దరఖాస్తును సమర్ధవంతంగా నిర్వహించండి

- పోలింగ్ బూత్ లెవెల్ అధికారులను ఆదేశించిన తహశీల్దార్

నవతెలంగాణ-బాల్కొండ


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్

ఓటరు నమోదు దరఖాస్తును సమర్ధవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ అడప శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం పోలింగ్ బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 26 , 27 తేదీల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న నూతన ఓటరు నమోదు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తేదీలలో పోలింగ్ బూత్ కేంద్రాల వద్ద ఉదయం 9.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఉండి ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఓటరు నమోదు చేసుకునేవారు ఫారం - 6, తొలగింపునకు ఫారం -7 మార్పుల కోసం ఫారం - 8 ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేందర్, సీనియర్ అసిస్టెంట్ రమేష్ , బూత్ లెవెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల పోస్ట్ కార్డు ఉద్యమం

నవతెలంగాణ-ఏర్గట్ల


పోస్టుకార్డులు పంపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

మండలంలోని సమగ్రశిక్ష ఉద్యోగులు గురువారం పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చాలి చాలని జీతంతో ఎన్నో ఏళ్ళుగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా తమను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని అన్నారు. మినిమం టైం స్కేల్ వర్తింపచేసి హెల్త్ కార్డ్స్, ఎక్స్ గ్రేషియా వర్తిపజేయాలని అన్నారు. అనంతరం సీఎం కేసీఆర్,విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐటీ మినిష్టర్ తారకరామారావు,వైద్యఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావుకు పోస్ట్ కార్డులు పంపి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్వో సంధ్య, ఏర్గట్ల సమగ్ర శిక్ష అధ్యక్షురాలు లలితా భార్గవి, ఉపాధ్యక్షురాలు సునీత, త్రివేణి, సీఆర్పీలు, సీఆర్టిలు, ఐఈఆర్పి, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు పెంచిన పింఛన్ అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్/కమ్మర్‌పల్లి


ఆర్మూర్ : పింఛన్ అందజేస్తున్న సరంచ్

స్థానిక ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని మిర్ధపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ మధు వర్మ గురువారం లబ్ధిదారులకు 4016 పెన్షన్ అందజేశారు. ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ఈ నెల వికలాంగులకు 3016 రూపాయల నుండి 4016కు పెన్షన్ పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భూమన్న, సెక్రటరీ రాజేశ్వర్,గ్రామశాఖ అధ్యక్షులు సాయరెడ్డి, నర్సింహా రెడ్డి, గంగాధర్, రాజన్న, ప్రదీప్, సంతోష్, భోజన్న, పోస్టుమెన్ ముతేన్న లబ్దిదారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండలంలోని అమీర్ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పుప్పాల గంగాధర్ దివ్యాంగులకు పెంచిన పింఛన్ పెంపు పత్రాలను అందజేశారు.రూ. 3016 నుండి రూ.4016 పింఛన్ల పెంపు పట్ల దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి ప్రశాంత్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గంగం గంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలావత్ ప్రకాష్, సొసైటీ వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, వార్డు సభ్యులు క్యాతం గంగారెడ్డి, తిప్పరెడ్డి లక్ష్మి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో ఎన్ఆర్ఐ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్


చెక్కును అందజేస్తున్న ట్రస్టు కార్యదర్శి

స్థానిక మారుతినగర్లోని స్నేహ సొసైటి ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ మానసిక వికలాంగుల పాఠశాలలో ఎన్ఆర్ఐ నోముల రాంచందర్ రెడ్డి 79 వ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమున్ని ఉద్దేశించి స్నేహసొసైటీ కార్యదర్శియస్. సిద్దయ్య మాట్లాడుతూ.. నోముల రాంచందర్ రెడ్డి నిజామబాద్ జిల్లా వాసి ఆయన అమెరికాలో స్థిరపడి జిల్లా అభివృద్ధికోసం రామనాములు చారీ డెబుల్ ట్రస్టు ఏర్పాటుచేసి పలు కార్యక్రములు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనాథ విద్యార్థులకు పాఠశాలను ఏర్పాటు చేసి విద్యను భోదిస్తున్నారు. మహిళలకు వృతి శిక్షణను ఇచ్చి జీవనోపాది ఇస్తున్నారు. వృద్ధాశ్రములకు ఇతిధికంగా సహాయాన్ని అందిస్తున్నారు అని అన్నారు. జన్మదినాన్ని పురస్కరించుకొని స్నేహం చారిటి కంటి ఆసుపత్రికి ఒక లక్ష రూపాయలను విరాళంగా అందించారని తెలిపారు. కార్యక్రమంలో రామ నాముల చారిటబుల్ ట్రస్టు కార్యదరి వాసు గౌడ్ పాల్గొని లక్ష రూపాయల చెక్కును అందించా రు. అదే విధంగా స్నేహసొసైటీ ప్రిన్సిపాల్ యస్. జ్యోతి, సురేందర్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, మానసిక, అంధవిద్యార్థులు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

బార్ధాన్ కార్మికులు పనిభద్రతకోసం ఉద్యమించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న మల్యాల గోవర్ధన్

బార్ధాన్ కార్మికులు పని భద్రతకై ఉద్యమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ పిలుపునిచ్చారు. గురువారం నిజామాబాద్ బార్దాన్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం యూనియన్ అధ్యక్షులు దండే రాము అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. బార్ధాన్ కార్మికులు గన్ని బ్యాగ్స్ రిపేరు చేస్తూ చాలీచాలని కూలి రేట్లతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పోటీ కార్మికులతో పని భద్రత కూడా కరువైందని అన్నారు. దుమ్ము ధూళిలో పని చేయడంతో అతి చిన్న వయసులోనే ప్రాణాలను కోల్పోతున్నారని, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం లేకపోవడం, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ లాంటి కనీస సౌకర్యాలు కూడా లేవని అన్నారు. పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర కో కన్వీనర్ ద్యారంగుల కష్ణ, భార్ధాన్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, ఇమామ్, విజయ్, అబ్దుల్, గంగాధర్, కిషన్, రాజు, భారతి బాయ్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఘరానా మోసగాడు అరెస్టు

పోలీసులకు అభినందనలు తెలిపిన కోటపాటి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గతేడాది డిసెంబర్‌లో డిచ్‌పల్లి ఆర్కె ట్రావెల్స్ పేరుతో వందలాది మంది దగ్గర కోటి రూపాయలకు పైగా వసూలు చేసి పారిపోయిన గల్ఫ్ ఏజెంట్ షేక్ బషీర్ ను ఎట్టకేలకు డిచ్ పల్లి పోలీసులు వారం రోజుల క్రితం అరెస్ట్ చేసి రిమాండుకు పంపించారు. డిచ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కష్ణను గురువారం డిచ్ పల్లి పోలీస్‌స్టేషన్లో 'ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక' అధ్యక్షులు కోటపాటి నర్సింహనాయుడు బషీర్ చేతిలో మోసపోయిన వారితో కలిసి సిఐకి ధన్యవాదాలు తెలిపారు. షేక్ బషీర్ ఒక్కొక్కరి దగ్గర నుండి 25 వేలకు పైగా 400 మంది దగ్గర కోటి రూపాయలకు పైగా వసూలు చేసి మోసగించాడని అన్నారు. రిమాండుకు పంపించినప్పటికీ బెయిల్ పై విడుదలయ్యే అవకాశముందని తెలిపారు. బషీర్ ను (పీడీ) కింద అరెస్ట్ చేసి బాధితుల డబ్బులు రికవరీ అయ్యేంత వరకు విడుదల కాకుండా చూడాలని ఇటీవల జిల్లా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని కోరామన్నారు. మంత్రి స్పందించి ఇన్చార్జి సీపీతో మాట్లాడి షేక్ బషీర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. పెండింగ్లో ఉన్న ఫిర్యాదులపై వివిధ పోలీస్టేషన్ల అధికారులు బుక్ చేయాల్సిందిగా కోటపాటి నర్సింహా నాయుడు డిమాండ్ చేశారు.

జూనియర్ కళాశాలలోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయినాథ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను డిచ్ పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యు) నాయకులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో జూనియర్ కళాశాల నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సీనియర్ అసిస్టెంట్ మోహమ్మద్ షఫీ కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ యు డివిజన్ కమిటీ నాయకుడు సాయినాథ్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల సీఎంసీ దగ్గర ఏర్పాటు చేస్తే అక్కడ అమ్మాయిలకు భద్రత ఉండదన్నారు. డిగ్రీ కళాశాలను మండల కేంద్రంలోని ఘన్పూర్ లోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తే విద్యార్థులకు భద్రత ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు అందుబాటులో ఉంటదన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విద్యార్థులను దష్టిలో పెట్టుకుని ఇక్కడే ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్ యు జిల్లా నాయకులు పవన్, సునీల్, నరేష్, అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని సంతోష్‌నగర్ తాండకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పాల్త్య శివరామ్ కార్యకర్తలు మాలవత్ ప్రకాష్, భుక్య బొజ్జ, పాల్త్యశ్రీను, పరుశురాం, గంగారాం, శేఖర్, లు ముత్యాల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి సునీల్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలపరిచి సునీల్‌రెడ్డి గెలుపుకు కృషి చేస్తామని అన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు బొదిరె స్వామి, కుంట రమేష్, జేజే నర్సయ్య, అనంతరావ్, నాగేంద్ర, మహేష్ తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి

- బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ మున్సిపల్ కార్మికులకు 8 నెలల పీఆర్సీ బకాయిలు ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని బిఎల్ టియు రాష్ట్ర అధ్యక్షులుదండి వెంకట్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బహుజన మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత మాట్లాడుతూ.. మున్సిపల్ మహిళా కార్మికులను శ్రమ దోపిడి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, స్థానిక నాయకులు రాజ్యు, శ్రీనివాస్, పాండు, బాజన్న, బి.అశోక్,రాజ్యలక్ష్మి, నర్సయ్య, గంగాధర్, ప్రసాద్ పాల్గొన్నారు..

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి

నవతెలంగాణ భీంగల్

మండలంలోని బాచన్‌పల్లి, బాబాపూర్, బాబానగర్ గ్రామాలకు చెందిన పలువురు బాదితులకు మండల బీఆర్ఎస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సను తీసుకున్న విషయం తెలుసుకున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెక్కులను మంజూరు చేయించారు. యంపిపి ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసి చౌట్‌పల్లి పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మోయిజ్, రైతుబంధు మండల అధ్యక్షుడు శర్మనాయక్, ఎంపిటీసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తాం

- ఇళ్ల నిర్మాణానికి 5 లక్షల సహాయం
- మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


మాట్లాడుతున్న భూపతిరెడ్డి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూపాలు ఐదు వందలకే గ్యాస్ సిలిండర్ల ను అందజేస్తామని, ఇళ్ల నిర్మాణానికి 5 లక్షల రూపాయల సహాయం పూర్తి సబ్సిడీతో అందజేస్తామని, విద్యార్థులందరికీ ఫిజు రియింబర్స్మెంట్ అందజేస్తామని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో గడప గడపకూ కాంగ్రెస్... పల్లెపల్లెకూ భూపతిరెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం లు మాటలకే పరిమితం అయ్యాయని వివరించారు. వరి క్వింటాలుకు రూ.2500 మద్దతు ధర, ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని పేర్కొన్నారు. వద్దులు, వితంతువులకు 4000 పెన్షన్, నెలకు 4000 చొప్పున పెన్షన్ అందజేస్తామని, ఆరోగ్య శ్రీ పథకంలో 5లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు, రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు రూ.12 వేల సహాయం, ప్రతి ఏడాది 2లక్షల ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముప్ప గంగారెడ్డి, మండల అధ్యక్షులు మోత్యారి నవీన్ గౌడ్, వెంకట్ రెడ్డి, సంతోష్ రెడ్డి, గంగామని, ఖాజా హబిబోద్దిన్, ఎన్ ఎస్ యుఐ రూరల్ ఇంచార్జీ ఆశిష్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరమే

- స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు

నవతెలంగాణ-ఆర్మూర్


క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్‌హెచ్‌వో

విద్యార్థుల దైనందిన జీవితంలో చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమేనని పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు అన్నారు. పట్టణంలోని మామిడిపల్లి విజయ్ హై స్కూల్‌లో గురువారం ఇంట్రామ్యురల్ గేమ్స్, స్పోర్ట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. చక్కగా మార్చి ఫస్ట్ చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విజయ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ అమతలత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయ బందం, విద్యార్థులు పాల్గొన్నారు.


తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి పాత్ర కీలకం

నవతెలంగాణ-సిరికొండ

దాశరథి రంగాచార్య 95వ జయంతిని సత్యశోధక్ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య దాశరథి రంగాచార్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోదారంలో దాశరథి పాత్ర కీలకమని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో తన సాహిత్యంతో విభిన్న రచనలు చేసి నిజాం నిరంకుశ పాలనను ఎండగట్టి, ప్రజలను చైతన్యపరిచి క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

నవతెలంగాణ-సిరికొండ



కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకునే స్తోమత లేని స్తోమత లేని ఎంతోమంది కి ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప వరం లాంటిదని టీఎస్ ఆర్టీసీ చైర్మన్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్ అన్నారు గురువారం పోతునూరు గ్రామానికి చెందిన గిద్దె చిన్నా గంగారెడ్డి లక్ష రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల బాలయ్య,ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, గ్రామ శాఖ యువత అధ్యక్షులు వినోద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పోటీ కోసం దరఖాస్తు చేసిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

గాంధీభవన్‌లో నియోజవర్గ అభ్యర్థిగా గురువారం పలువురు నాయకులు అప్లికేషన్ వేశారు. నిజాంసాగర్ మాజీ చైర్మన్ శ్రీ ఎల్ల సాయి రెడ్డి ఆయనతోపాటు ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ దేగాం ప్రమోద్, మంథని మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ విఠం జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి గ్రామసభలో పలు తీర్మానాలు



తీర్మానాలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశంలో పలు తీర్మానాలను చేసినట్లు సర్పంచ్ మీర్జా కలీంబెగ్ పేర్కొన్నారు. గురువారం సర్పంచ్ మీర్జా కలీం బేగ్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీకి సంబంధించిన రెండు మోటారు పంప్ సెట్లు, వంద బల్బులు, రెండు వైర్‌బెండల్స్, డ్రైనేజీ పనులను చేపట్టడానికి పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవోల్ల యోగేష్, ఎంపీటీసీ అసాద్ బేగ్, పాలకవర్గ సభ్యుడు ఖలీద్, కోఆప్షన్ సభ్యులు యాదవ రావు, దేవరావు, గ్రామ కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని పాల్వంచకు చెందిన ముదిరాజ్ కుల సంఘ సభ్యులు కాంగ్రెస్ మాజీమంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. కామారెడ్డి నుండి కెసిఆర్ పోటీ చేస్తున్నందున షబ్బీర్ అలీని గెలిపించడానికి మద్దతు తెలుపడానికి కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు. కార్యక్రమంలో మాచారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సునావత్ గణేష్ నాయక్, సీనియర్ నాయకులు పొన్నాల లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు నౌసిలాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి నిమ్మల నర్సింలు, వేల్పుగొండ గ్రామ అధ్యక్షులు మజార్ మధు, పరశురాములు, సిద్దయ్య, దేవేందర్ గౌడ్, బలారం, పాల్వంచ గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాతలూ.. దయ చూపండి

- నిండు ప్రాణాన్ని కాపాడాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి



వేడుకుంటున్న బాధితుడి తండ్రి

నవతెలంగాణ-లింగంపేట్

దాతలు దయచేసి రెండు కిడ్నీలు దెబ్బతిన్న యువకుడి నిండు ప్రాణాలను మానవత్వంతో ముందుకు వచ్చి కాపాడాలని యువకుడి కుటుంబ సభ్యులు పలువురికి విజ్ఞప్తి చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం జల్లిపల్లి గ్రామానికి చెందిన అల్లం అంజయ్యది నిరుపేద కుటుంబం. అంజయ్యకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ మధ్యనే తన పెద్ద కుమార్తె మరణించింది. అల్లం అంజయ్య సైతం వికలాంగుడు. అతని ఆరోగ్య పరిస్థితి కూడా సరిగా లేదు. ఇదిలా ఉండగా.. అతని కుమారుడు అల్లం రవి (25) బి పాజిటివ్ బ్లడ్ గ్రూప్. ఇతని రెండు కిడ్నీలు పాడయ్యాయి. తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాల్సిన వయసులో కుమారుడు మంచం పట్టడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామస్తుల సహకారంతో ఇప్పటివరకు ఐదు లక్షల వరకు అప్పుచేసి మల్లారెడ్డి, నారాయణ, హాస్పిటల్‌లో వైద్య చికిత్సలు చేయించారు. అయినా తగ్గుముఖం పట్టలేదు. ప్రస్తుతం అతన్ని మిత్రుల ఆర్థిక సహాయంతో ఎల్లారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్‌లో వారానికి రెండు మూడుసార్లు డయాలసిస్ వైద్యం చేస్తున్నారు. రెండు కిడ్నీలు ఫెయిల్ అవడంతో కిడ్నీ మార్పిడి కొరకు ఆపరేషన్ తప్పనిసరని సూచించారు. కిడ్నీ మార్పిడి, ఆపరేషన్ కోసం డబ్బులు లేకపోవడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు ముందుకొచ్చి తమకు తోచినంత ఆర్థిక సాయం చేసి నిండు ప్రాణాన్ని కాపాడాలని వేడుకుంటున్నారు.

చెరువు అలుగు గండిని పరిశీలించిన ఎంపీపీ దశరథ్‌రెడ్డి



గండిని పరిశీలిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రామారెడ్డి పరిసర ప్రాంతంలో గల రంగా చెరువు అలుగు పక్కన, గత కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గండిపడటంతో గురువారం స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథరెడ్డి నాయకులతో కలిసి పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే సురేందర్‌కు చరవాణి ద్వారా సమాచారం అందించడంతో, గండిని వెంటనే మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించినట్లు దశరథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ రవీందర్రావు, కాసర్ల రాజేందర్, భానూరి నర్సారెడ్డి, లేగల మహిపాల్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఉత్నూర్ గ్రామంలో మన ఊరు మన బడి పనులను జడ్పీటీసీ కమిలి నర్సింలు గురువారం ప్రారంభించారు. ఈ పాఠశాల నిర్మాణానికి రూ.86లక్షల 57,602 మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతోని 5 గదులు, మౌలిక వసతులు, డైనింగ్ హాల్, తాగునీరు సౌకర్యం ఏర్పాటు తదితర పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోతె సాయవ్వ, ఉపసర్పంచ్ శివ పాటిల్, ఎంపీటీసీలు చందర్‌రావు, పాపనోల్ల బీరయ్య, సింగిల్‌విండో చైర్మెన్ ప్రభాకర్‌రావు, బీఆర్‌యస్ నాయకులు రాములు, గైని రమేష్, శ్రీనివాస్ గౌడ్, పరమేష్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వై.ఆనంద్, ప్రవీణ్, ఎస్.ఎం.సి.చైర్మన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బాలబాలికలు ఆరోగ్యవంతంగా ఉండాలి



విద్యార్థులను పరిశీలిస్తున్న వైద్యాధికారి రాజ్‌కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్య బోధన చేస్తున్న బాల బాలికలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే ఉపాధ్యాయులు చెప్పే బోధన అంశాలపై ప్రత్యేక దృష్టి ఉంటుందని ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వైద్య అధికారి రాజ్‌కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచన మేరకు ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోని బాలబాలికలకు ఆరోగ్యం అలాగే చదువుపై శ్రద్ధ వహించే విధంగా వైద్య అధికారులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు రాజ్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా జానకంపేట, తానాకాలాన్, ప్రాథమిక, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్యమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న బాల బాలికలకు ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. బాలబాలికలకు కావలసిన ఔషధాలతోపాటు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలకు వచ్చే బాలబాలికలు ఉదయం పూట భోజనం చేసేముందు చేతులు కాళ్ల ఒకటికి రెండుసార్లు శుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలని, అలాగే మలవిసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత కూడా కాళ్ల చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని ఆయన తెలిపారు. సుమారు పాఠశాలలోని 150 మంది బాల బాలికలకు ఆయన ఆరోగ్య మేళా కార్యక్రమం చేపట్టి ఔషధాలు అవసరం ఉన్న బాల బాలికలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జానకంపేట ఆరోగ్య ఉప కేంద్రం, మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అనూష, ఉపాధ్యాయులు సాదిక్, నరసింహారెడ్డి, అరుణ శ్రీ, తానాకాలాన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి వికలాంగుల పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న వికలాంగులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డిలో వికలాంగులు పింఛన్ పెంచినందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జాజాల సురేందర్ చిత్రపటాలకు గురువారం పాలాభిషేకం చేసినట్టు సర్పంచ్ అనిల్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ వికలాంగులకు 3016 పింఛన్ ఉండగా.. రూ.4016కు పెంచడంతో వికలాంగులకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామంలోని ప్రధాన కూడలి వద్దకు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ చిత్రపటాలకు సర్పంచ్ అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ బోధనపు ఇందిరా, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదిలాబాద్ బహిరంగ సభలో వికలాంగులకు పింఛన్లు పెంచి తీరుతానని హామీ ఇచ్చారని, అమలు చేసిన ఘనత కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఇచ్చిన హామీకి కట్టుబడిన వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సాయి కిరణ్, మనోజ్, పార్టీ కార్యకర్తలు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఓటర్ కార్డు

- తహసీల్దార్ రాజు



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరూ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని నసురుల్లాబాద్ తహసీల్దార్ రాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక ఏర్పాటు చేసిన బీఎల్ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజు మాట్లాడుతూ.. మండలంలోని 17 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల్లో ఉన్న బియ్యం క్షేత్రస్థాయిలో జల్లి కొత్త ఓటర్లను నమోదు అయ్యేందుకు కృషి చేయాలన్నారు. ఒకటి అక్టోబర్ 2023 నాటికి యువతీ యువకులు 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వారిగా అర్హులైన నూతన ఓటర్లను గుర్తించి నమోదు చేయాలన్నారు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు వయసు నుంచే యువతీ యువకులతో పాటు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్‌లను ఫారం-6 ద్వారా ఓటర్లుగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటర్లకు వారి వివరాలలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించనున్నట్టు, బిఎల్ఓలు ఇంటింటి సర్వే ద్వారా ఓటర్లను చైతన్య వంతులను చేయాలని, చనిపోయిన వారి వివరాలను జాబితా నుంచి తొలంగించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో బూత్ లెవెల్ అధికారులు, ఎలక్షన్ సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో తుది ఓటరు జాబితా ప్రచురణకు ముందు ఒకటికి రెండు సార్లు ఫోటోలు, పేర్లు, ఇతర వివరాలను బూత్ స్థాయి అధికారులు సరిచూసుకోవాలని అన్నారు. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపు ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు జరగాలని, పోలింగ్ స్టేషన్ పరిధిలో వచ్చిన ఫారం 7 దరఖాస్తులను పరిశీలించి సదరు ఓటర్లు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా విచారించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న దివ్యాంగ ఓటర్ల వివరాలు చిరునామాతో మ్యాప్ చేసి పెట్టుకోవాలని, ఎన్నికల సమయంలో వారి కోసం వాహనాలు ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ ఓట్లు, లాజికల్ ఎర్రర్స్ డెమోగ్రాఫిక్ ఎర్రర్స్ పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంపీఓ రాము, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

దశాబ్ది వనాన్ని పరిశీలించిన కేంద్ర బృందం సభ్యులు



వనాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఠానాకలాన్ గ్రామ శివారులో గల అలీసాగర్ ఉద్యానవనం వద్ద చేపట్టిన దశాబ్ది వనాల పెంపకాన్ని కేంద్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఉన్న దశాబ్ది వనాలతో పాటు ఠానాకలాన్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన దశాబ్ది వనాన్ని కూడా అధికారులు పరిశీలించారు. కేంద్ర బృందం సభ్యులు రమేష్, శరత్ దశాబ్ది వనం పెంపకాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వనంలో 1000 మొక్కలు పెంచుతున్నారు. ఈవనం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ గోపాలకృష్ణకు సూచించారు. తానాకాలన్ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నరెడ్డి పనితీరు పట్ల కేంద్ర బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపాల కృష్ణ, ఎడపల్లి మండల ఉపాధి హామీ ఏపిఓ శ్రీవాణి, జిల్లా ప్లాంటేషన్ అధికారి కపిల్, నీటిపారుదల శాఖ ఎఈలు, టిఎలు జ్యోతి, గ్రామఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి

నవతెలంగాణ-బోధన్

విద్యార్థులలోని నైపుణ్యాలను గుర్తించి వారిని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎంఈఓ నాగనాథ్ సూచించారు. గురువారం బోధన్ డివిజన్ ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బోధన్ డివిజన్లోని బోధన్ మండలం సాలూర, కోటగిరి, పోతంగల్, ఎడపల్లి, మోస్రా, చందూర్, నవీపేట్, రెంజల్, రుద్రూర్ మండలాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, కస్తూర్బాగాంధీ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లకు రెసిడెన్షియల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు డివిజన్ స్థాయి మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు 24-8-2023 నుంచి నిర్వహించనున్నట్టు తెలిపారు. కోవిడ్-19 వలన విద్యార్థుల అభ్యసన నష్టాలను సరిదిద్దడానికి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడానికి ప్రధానోపాధ్యాయులు సానుకూల దృక్పథంతో కృషి చేయాలని సూచించారు. పిల్లల అభ్యసన అభివృద్ధికై నూతన మెళకువలు పాటిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోర్సు కోఆర్డినేటర్, సెక్టరియల్ ఆఫీసర్ నరేష్, శాంతకుమారి, నోడల్ ఆఫీసర్ నాగయ్య రిసోర్స్ పర్సన్‌లు మధుసూదన్, రాజమంజూషా, ఆనంద్, హరిత, శివరాజ్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

- ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ సోమశేఖర్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

త్వరలో హైదరాబాద్ నగరంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభలో మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సీహెచ్ సోమశేఖర్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం సాలూర మండల కేంద్రంలోని దండోరా కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనకై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించే సభకు ప్రతి ఇంటి నుంచి మాదిగ సోదరులు హాజరు కావాలన్నారు. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వాలు రిజర్వేషన్లు అమలు చేయాలని, ఉన్న వాటిని పట్టించుకోవడం లేదని అన్నారు. రాష్ట్రంలో అతి తక్కువ శాతం ఉన్న అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు అందుతున్నాయని అన్నారు. మాదిగ ఉపకులాలకు విద్య వైద్య రంగాలలో ఉద్యోగ రంగాలలో తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన 100 రోజులలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీలు ఇచ్చి మోసం చేసిందని కావున కేంద్ర ప్రభుత్వం మెడలు వంచడానికి మాదిగల విశ్వరూపం మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాలూర మండల ఇన్చార్జిగా సుభాష్..

సాలూర నూతన మండల ఇంచార్జిగా ధమ్మన్ గావ్ సుభాష్, కో కన్వీనర్‌గా మొండూరి అశోక్‌ను ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సోమశేఖర్ మాదిగ ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ గోనెవర్ మారుతి మాదిగ, జిల్లా నాయకులు లింబూరి లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ బోధన్ ఉమ్మడి మండల ఇన్చార్జి బూరె శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ బాన్సువాడ నియోజకవర్గం ఇన్చార్జి సోంపూర్ పోచీరం మాదిగ, సాలూర గ్రామ అధ్యక్షులు చంటి, కార్యదర్శి రాజు, మొండూర్ లస్మయ్య, సాయికుమార్, రవి, వీరయ్య, సాయినాథ్ యువకులు పాల్గొన్నారు.

వికలాంగుల పెన్షన్ పెంపు పత్రాలు పంపిణీ



పెన్షన్ పత్రాలు అందజేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ వికలాంగులకు రూ.3016 నుంచి 4016కు పెంచడంతో వికలాంగులకు సర్టిఫికెట్లను మద్నూర్ గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం గ్రామ సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విట్టల్, ఎంపిటిసి కుటుంబ సభ్యులు శివాజీ, రాష్ట్ర కుశాల్, గ్రామ కార్యదర్శి సందీప్, పంచాయతీ జూనియర్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన బిచ్కుంద నాయకులు

నవతెలంగాణ-బిచ్కుంద



రాజేశ్వరరావును పుష్పగుచ్ఛం అందజేత

తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన రాజేశ్వరరావు ఎంపీపీ అశోక్ పటేల్, ఏఎంసీ చైర్మన్ నాగనాథ్ పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకట్రావుదేశాయి, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీహరిరాజు హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల క్రిస్టియన్ మైనారిటీ కార్యాలయంలో కలిసి శాలువా పూలగుచ్ఛంతో సన్మానించారు. ఎంపీపీ అశోక్ పటేల్ మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలోని క్రిస్టియన్, మైనారిటీల అభ్యున్నతి కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా విన్నవించినట్లు ఎంపీపీ తెలిపారు.

దేవి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



వైద్యశిబిరంలో పలువురికి సన్మానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


మండలంలోని అడివి లింగాల్ గ్రామంలో దేవి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. గ్రామంలో 130 మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ చేసినట్టు వైద్యులు యశ్వంత్ రామచంద్ర తెలిపారు. అలాగే కండ్ల కలక వ్యాధిపై అవగాహన కల్పించి ముందస్తుగా మందులను అందజేశారు. వర్షాకాలం సందర్భంగా ప్రజలందరూ చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మంచి సురక్షితమైన నీటిని తాగాలని సూచించారు. సర్పంచ్ సువ్రణ ప్రతాప్‌రెడ్డి, ఉప సర్పంచ్ సిద్దిరాములు, ఎంపిటిసి పార్వతి, గ్రామపెద్దలు పడమటి రాజేశ్వర, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు పడమటి దయాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా ఎల్లారెడ్డిలో ఫైర్ స్టేషన్ ఎదురుగా హాస్పిటల్ ప్రారంభించిన సందర్భంగా ఉచిత వైద్య శిబిరం అడివి లింగాల్ గ్రామంలో ఏర్పాటు చేసినట్టు హాస్పిటల్ ఎండీ మహిపాల్ తెలిపారు. శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, పి విజయ్ కుమార్, ఆరోగ్య సిబ్బంది వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-వర్ని

కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌ల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో పాఠశాలలో పనిచేసే సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా తమను క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకు పేస్కేలు చెల్లించాలని కోరారు. 2018 సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రమాద బీమా 10 లక్షలు, ఆరోగ్య బీమా 5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు పాఠశాల సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలపై దాడికి నిరసనగా.. రోడ్డుపై బైఠాయింపు



రోడ్డుపై బైఠాయించిన నాయకులు

నవతెలంగాణ-బిచ్కుంద

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు స్థానిక సమస్యలపై బుధవారం ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడికి యత్నించిన బిజెపి కార్యకర్తలను బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేయడంతో దీనికి నిరసనగా జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే అరుణతార ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే ఇంటి ముందర గల ప్రధాన రహదారిపై బైఠాయించారు. జిల్లా అధ్యక్షురాలు అరుణ తార మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పెన్షన్లు, దళిత బంధు, బీసీ బంధు, కొత్త రేషన్ కార్డులు, తదితర స్థానిక ప్రజల సమస్యలపై ప్రశ్నించడానికి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించిన బిజెపి కార్యకర్తలను బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, దాడులు చేస్తున్న పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని దానికి నిరసనగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్నామన్నారు. ఈ దాడిలో బిజెపి కార్యకర్తలు శెట్టిపల్లి విష్ణు, శివాజీ పటేల్, సంజుపటేల్, గోపాల్ చారి, జాదవ్ పండరి, మేకల రమేష్ తీవ్రంగా గాయపడ్డారని ఇలాంటి దాడులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో రాకపోకలకు తీవ్రంగా అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సముదాయించడంతో రోడ్డుపై బైఠాయించిన బిజెపి శ్రేణులు అక్కడి నుండి వెళ్ళిపోయారు.

ఉపాధ్యాయులు పీఆర్టీయూ సభ్యత్వం తీసుకోవాలి

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం పీఆర్టీయూ (ఉపాధ్యాయ సంఘం) సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్...మాట్లాడుతూ.. పీఆర్టీయూ భవన నిర్మాణం, సాధించిన విజయాలను గుర్తుచేశారు. పెండిగులో ఉన్న బిల్లులు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ముప్కాల్ మండల పీఆర్టీయూ అధ్యక్షులు సామ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, ఆర్మూర్ డివిజన్ ఇంచార్జి తుమ్మల లక్ష్మణ్ పటేల్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సురేష్ కుమార్, గంగాధర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తాడూరి లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి గుండోజి నరేందర్, మండల అసోసియేట్ అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలు గీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి 4

శుక్రవారం 25 ఆగస్టు 2023

ఏఎన్ఎం నోటిఫికేషన్ కాపీలు దహనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తొమ్మిదో రోజు సెకండ్ ఏఎన్ఎంల నిరసనలో భాగంగా గాంధీ చౌక్ నుండి బస్టాండ్ రైల్వే స్టేషన్ మీదుగా ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చౌక్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం విడుదల చేసిన ఏఎన్ఎం నోటిఫికేషన్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.హనుమన్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండవ ఏఎన్ఎం లను రెగ్యులర్ చేయాలని, నూతనంగా ప్రవేశపెట్టిన నోటిఫికేషన్ రద్దు చేయాలని గత 23 రోజులుగా నిరసనలు, తొమ్మిది రోజులుగా విధులను బహిష్కరించి సెకండ్ ఏఎన్ఎంలు సమ్మె చేస్తున్న ప్రభుత్వంలో ఉలుకు పలుకు లేకపోవడం దురదృష్టం అని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సంధ్యారాణి, భాగ్యమ్మ, నాయకులు కళావతి, రాణి, సరస్వతి, సావిత్రి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్ అంబేద్కర్‌ను కలిసిన మాల మహానాడు సంఘం నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ప్రకాష్ అంబేద్కర్‌తో నాయకులు

జిల్లా మాల మహానాడు నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ముంబై నగరంలోని అంబేడ్కర్ నివాసం రాజ్ గృహ నందు ప్రకాష్ అంబెడ్కర్ ని కలిశారు. నిజామాబాద్ జిల్లాలో అక్టోబర్ నెలలో నిర్వహించే సభకు హాజరుకావాలని వారిని కోరారు. కార్యక్రమంలో మల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజ్, జిల్లా అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లయ్య ఉపాధ్యక్షులు బత్తుల కిష్టయ్య, అధ్యక్షులు సఖి ప్రభాకర్, ఆర్మూర్ ఇన్చార్జి ఇత్వాపూర్ లింగన్న, విజయ్ సోలంకి, దయానంద్, కమలేష్, సంజు, గంగాలే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనానికి రూ.7.50 లక్షలు మంజూరు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ మండలం ధర్మారం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ భవనానికి రూ. 7.50 లక్షలు మంజూరుచేసిన ప్రొసీడింగ్ ఆర్డర్స్ పత్రాలను క్యాంప్ కార్యాలయంలో గురువారం అందచేశారు. ఎస్సీ కమ్యూనిటీ సోదరులు తమ సొంత స్థలంలో భవన నిర్మాణం చేసుకుంటామని ఎమ్మెల్యేను కోరారు. ఆయన నిధులనుండి కేటాయిస్తూ ప్రొసీడింగ్ ఆర్డర్స్ పత్రాలను కుల సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా యువ నాయకులు జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్, మండల అధ్యక్షులు మధుకర్ రావు, జడ్పీటీసీ సుమలత గోపాల్ రెడ్డి, సర్పంచ్ అనం సునీత, వైస్ ఎంపీపీ సాయిలు. ఎంపీపీ ప్రేమ్ దాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాజిరెడ్డికి అభినందనలు తెలిపిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇటీవలే కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో బాజిరెడ్డి గోవర్ధన్ కి మూడవ సారి అవకాశం రావడం బీసీలకు గర్వకారణమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ అన్నారు. గురువారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా బిసి సంక్షేమ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బాజిరెడ్డి గోవర్ధన్ సేవలో ముందుంటారని, మున్ముందు ఆయనకు పెద్ద పదవులు రావాలని ప్రార్థిస్తున్నామని అని అన్నారు. కార్యక్రమంలో బాజిరెడ్డి జగన్, బుస్స ఆంజనేయులు, ధర్మనం దేవేందర్, బాలన్న, విజయ్, విష్ణు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా రాజేశ్వరరావు

నవతెలంగాణ-కంఠేశ్వర్



రాజేశ్వర్‌రావును అభినందిస్తున్న మంత్రి

రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా రాజేశ్వర్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తనపై నమ్మకంతో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్య తలు అప్పగించిన ందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు, సహకరించిన నిజామాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు, సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపి.సురేష్ రెడ్డి,ఎమ్మెల్సీ ఎల్.రమణ తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా క్రీడాపోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల ఆగస్టు 29న హాకీ మాంత్రికుడు భారత హాకి దిగ్గజం స్వర్గీయ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం, జిల్లా యువజన క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి శైలి బిల్లాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈనెల 28, 29 తేదీల్లో కలెక్టర్ గ్రౌండ్‌లో జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల అనంతరం విజేతలకు 29న బహుమతుల ప్రధానం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారుల 15 సంవత్సరాల నుంచి 29సం రాల మధ్య ఉండాలని తెలిపారు. 100మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్ , జావలిన్ త్రో, హాకీ, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్‌పుట్ క్రీడల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల జట్లు, క్రీడాకారులు ముందుగా తమ పేర్లను వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వాట్సాప్ నెం.9100435410. నిజామాబాద్ జిల్లాలోని యువకులు విజయవంతం చేయాలని కోరారు.

26న ఉద్యోగ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 26 న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీ సిరిమల్ల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు గజానన్ ఇండస్ట్రీస్ బిజినెస్ సొలుషన్స్ నిజామాబాద్ జిల్లా పరిధిలోనే ఎలక్ట్రిషన్, మెకానికల్ మెంటనెన్స్, వెల్డర్ మెషిన్, షిఫ్ట్ ఆపరేటర్, లతే మెషిన్ ఆపరేటర్, అకౌంట్ ఎగ్జిక్యూటివ్, ఉద్యోగాలు ఉంటాయని పేర్కొన్నారు. ఐటీఐ, డిప్లమా, ఇంటర్ వొకేషనల్, బీకాం డిగ్రీ వారు అర్హులని, వయోపరిమితి 30సంలపైన ఉండాలని తెలిపారు. నిజామాబాద్‌లోని శివాజీనగర్‌లోగల జిల్లా ఉపాధి కార్యాలయంలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 6305743423, 9581768413,9959456793 సంప్రదాంచాలని పేర్కొన్నారు.

లక్ష రూపాయల ఎల్వోసి అందజేసిన మంత్రి

నవతెలంగాణ - వేల్పూర్

మండలంలోని సాహెబ్ పేట్‌కు చెందిన పి. అశోక్ నిమ్స్ హాస్పిటల్ లో మోకాలి సర్జరీ కోసం చేరగా రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి లక్ష రూపాయల ఎల్వోసీ మంజూరు చేయించారు. ఎల్ఓసి కాపీని వారి కుటుంబ సభ్యులకు మంత్రి గురువారం హైదరాబాద్‌లో అందజేశారు. ప్రశాంత్‌రెడ్డి రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

చంద్రయాన్ 3 విజయోత్సవ సంబరాలు

- భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో..
- విద్యార్థులతో చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీలు
- జయహో భారత్ నినాదాలు



కంఠేశ్వర్: మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



నిజామాబాద్ రూరల్: ఇండియన్ పబ్లిక్ స్కూల్లో



ఆర్మూర్ : క్షత్రియ స్కూల్లో

నవతెలంగాణ-కంఠేశ్వర్

శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళలు చేసిన కృషిని అభినందించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ నాయకులు తెలిపారు. గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ నిజామాబాద్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో ఇస్రో సాధించిన చంద్రయాన్ -3 మిషన్ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్క సైంటిస్ట్, ఇంజనీర్లకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర ఉపాధ్యక్షులు హెచ్. గణేష్ మాట్లాడుతూ.. భారతదేశం అనేక దేశాల వలసరాజ్యంలో ఉండి స్వాతంత్రం సాధించుకొని ఈ డెబ్బై ఆరు సంవత్సరాల్లో ప్రపంచంలోనే శక్తివంతమైన అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో విజయాలను సాధిస్తుందని అన్నారు. ఇస్రో సైంటిస్టులు చంద్రయాన్ -3 మిషన్ విజయవంతంగా పూర్తి చేసి ప్రతి ఒక్క భారతీయుడు గర్వపడేలాగా చేసారని అన్నారు. మరి ముఖ్యంగా మహిళలు ఒకప్పుడు బయటకు వచ్చి చదువుకోడమే గగనం అనే రోజుల నుండి నేడు గగన ఉపరితలాలకు ఎదిగి , ఈ చంద్రయాన్ -3 విజయవంతానికి కృషి చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ అభివృద్ధికి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి రానున్న కాలంలో మరిన్ని ఆవిష్కరణలకు, ప్రయోగాలకు రేపటి తరానికి అందేరకంగా చర్యలు తీసుకోవాలని అన్నారు విద్యార్థులు కూడా ఈ మిషన్ ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మంచి సైంటిస్టులుగా మేధావులుగా తయారవ్వాలని అన్నారు. కార్యక్రమంలో నగర నాయకులు బాబురావు, వరదరాజు, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : చంద్రయాన్-3 సక్సెస్‌ఫుల్ ల్యాండ్ సందర్భంలో పట్టణంలోని స్థానిక సీవీఆర్ జూనియర్ కళాశాలలో గురువారం సెమినార్ నిర్వహించారు. చంద్రయాన్-3 మిషన్ గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సిద్దాల నాగరాజు మాట్లాడుతూ... గత నెల 14న శ్రీహరికోట నుంచి చంద్రయాన్-3 నింగిలోకి పంపించారని అన్నారు. సుమారు 40వ రోజున చంద్రమండలపై దక్షిణ ధ్రువంపై ల్యాండింగ్ విజయవంతం అయిన సందర్భంగా ఇస్రో చైర్మన్ సోమనాథ్, ఇస్రో శాస్త్రవేత్తలకి ధన్యవాదాలు తెలియజేశారు గతంలో సోవియట్ యూనియన్ రష్యా, చైనా, అమెరికా, లాంటి దేశాలు మూన్ మిషన్‌లో సక్సెస్ సాధించాయి కానీ చంద్రయన్ 3 దక్షిణ ధ్రువంపై భారత్ జయకేతనంతో తొలి దేశంగా రికార్డు సృష్టించిందని అన్నారు. దేశ కీర్తిని రెపరెపలాడించి చంద్రయాన్-3 జాబిల్లిపై అడుగుపెట్టిన తొలి దేశంగా రికార్డ్ అని చెప్పారు. ప్రయోగం విజయవంతం కావడంతో జాబిల్లికి సంబంధించిన అక్కడి రసాయనిక విశ్లేషణలు చేసి ఆ సమాచారాన్ని భూమికి పంపనుందని అన్నారు. అంతరిక్ష పరిశోధనలో భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత పెరిగిందన్నారు. సైన్స్ మాత్రమే నమ్మాలని మూఢనమ్మకాలను నమ్మొద్దని, సైంటిఫిక్ విద్యను అభ్యసించి దేశ భవిష్యత్తు కోసం కృషి చేయాలని కోరారు పురుషాధిక్యతతో అణిచివేయాలని చూస్తే చంద్రమండలం వరకు ఎగరగలమని నిరూపించిన భారత నారీమణులకు జోహార్లు అని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు జవహర్ సింగ్, అరవింద్, అభి, శ్రీను, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు చంద్రయాన్ -3 విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో స్వీట్లను పంచారు. అనంతరం పాఠశాల నుండి పాత 7 నంబర్ జాతీయ రహదా, ప్రధాన వీధీల గుండా విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. మేరా భారత్ మహాన్, భారత్ మాతాకీ జై, జయహెూ భారత్, భారత్‌కి షాన్-చంద్రయన్-3 అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ లు కోటగిరి భానుచందర్, ఆకుల లక్ష్మన్, ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని తొలికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం చంద్రయాన్ 3 వీడియో క్లిప్పింగ్స్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్ మాట్లాడుతూ.. ఇస్రో శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూపరాణి, సంజీవ్ కుమార్, గౌతమి, పణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు

ముప్కాల్: చంద్రాయన్-3 మిషన్ విజయవంతం కావడంతో గురువారం మండల కేంద్రంలో జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులకు ప్రార్థన సమయంలో చంద్రాయన్-3 గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేందర్ వివరించారు. భూమి నుంచి చంద్రుడి దిశగా 41 రోజుల ప్రయాణం అనంతరం చంద్రుడిపై ల్యాండింగ్ అయినట్లు విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేంధర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సాధించిన చంద్రయాన్ 3 విజయంపట్ల క్షత్రియ స్కూల్, క్షత్రియ కళాశాల విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఇట్టి ర్యాలీని క్షత్రియ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించినారు. సుమారు 100 మీటర్ల పొడువు గల త్రివర్ణ పతకాన్ని మోస్తూ దాదాపు 800 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్న విజయోత్సవ భారీ ర్యాలీ మామిడిపల్లి చౌరస్తా నుండి ప్రారంభం అయి నిజామాబాద్ చౌరస్తా వరకు సాగింది. ఈ ర్యాలీలో ఇస్రో శాస్త్ర వేత్తల ఘనకీర్తిని పొగుడుతూ విద్యార్థులు నినాదాలను ఇచ్చారు. చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. చంద్రయాన్-3 విజయం ఇస్రో శాస్త్రవేత్తల కృషి,పట్టుదల అకుంఠిత దీక్షతో నెరవేరిందని అన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగిన మొదటి దేశంగా భారత్ అవతరించిందని, చంద్రయాన్-3 విజయం కోసం ఇస్రో బృందం ఎంతో శ్రమించి విజయాన్ని అందుకున్నారని ఉన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, స్కూల్ ప్రిన్స్ పాల్ లక్ష్మీనరసింహ స్వామి, కళాశాల అధ్యాపకులు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని తొలికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం ఇస్రో నమూనాలో ప్లే గ్రౌండ్ లో కూర్చొని ప్రదర్శించారు. చంద్రయాన్ 3 వీడియో క్లిప్పింగ్స్ ను వీక్షించారు. ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్ ఇస్రో శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉ పాధ్యాయులు పాల్గొన్నారు

నిజామాబాద్ రూరల్: చందమామపై భారత జెండాను ఎగరవేసిన ఇస్రో శాస్త్రవేత్తలు 140కోట్ల ప్రజలు గర్వించదగిందని, చంద్రయాన్ యాత్రవల్ల భారత అంతరిక్ష సంస్థ ఇస్రో చందమామ యాత్రలో ఇప్పటిదాకా ఏ దేశము అందుకోలేని విజయం భారతదేశం అందుకుందన్నారు. విక్రమ ల్యాండర్ చందమామ దక్షిణ ధ్రువం వద్ద ఉపరితలంపై సురక్షితంగా దిగింది చంద్రుడు పై అడుగుపెట్టిన రోవర్ చందమామపై శాశ్వతంగా మన ముద్ర వేసిందన్నారు. ర్యాంపు నుంచి దిగగానే ప్రజ్ఞాన్ వెనుక చక్రాలపై ఉన్న భారత జాతీయ చిహ్నం మూడు సింహాల లోగోను ఇస్రో ముద్రలను చందమామపై అద్దిందని తెలిపారు.. భారతీయ ఇస్రో శాస్త్రవేత్తలకు ఇండియన్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ నందు రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం యువకులు విద్యార్థులు చంద్రయాన్ -3 విజయోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు జాతీయ జెండాలతో ఇస్రో అక్షరాల క్రమంలో కూర్చుని తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రయాన్-3 ప్రయోగం విశేషాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ఉప్లూర్ చౌరస్తా వద్ద భారతమాత విగ్రహం ముందు యువకులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, జాతీయ జెండాలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

జూనియర్ కళాశాల ప్రారంభానికి పరిశీలన



పరిశీలిస్తున్న డీఐఈవో రఘురాజ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించేందుకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎల్. రఘురాజ్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరం నుండి జూనియర్ కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలలో గదులను పరిశీలించారు.ఈసందర్భంగా రఘురాజ్ మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరం నుండే అడ్మిషన్లను తీసుకుంటున్నామని తెలిపారు. ఎంపీసీ, బైపిసి, సిఇసి, హెచ్ఈసి తెలుగు, ఇంగ్లీష్ మీడియం లలో అడ్మిషన్లు ఈనెల 25వ తేదీ నుండి తీసుకుంటామని చెప్పారు. ఇప్పటివరకు ఏ కళాశాలలో అడ్మిషన్ పొందని వారు అడ్మిషన్ తీసుకోవచ్చని సూచించారు. పాఠశాలలో కళాశాలను కొనసాగించేందుకు అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ రెడ్డి, ఇంచార్జి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, సిఆర్‌పి అంజయ్య పాల్గొన్నారు.

పట్టణ కోర్టులో లీగల్ సెల్ నాయకుల సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్



సమావేశంలో లీగల్‌సెల్ నాయకులు

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్మూర్ డివిజన్లోని రెండు నియోజకవర్గాలకు సిట్టింగ్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బాల్కొండ సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి టికెట్లు ఇవ్వడంతో గురువారం బారాస లీగల్ సెల్ న్యాయవాదులు ధన్యవాదాలు తెలిపారు.. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో లీగల్ సేల్ నాయకులు ఎం. కె. నరేందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. లీగల్ సెల్ విస్తృతమైన ప్రచారం రెండు నియోజకవర్గాలలో నిర్వహిస్తుందని, గడపగడపకు సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కొంద్ర కృష్ణంరాజు, మోహన్, జక్కుల శ్రీధర్, జగన్, ఆ వారి రమేష్, దేవన్న, గణేష్, ఎం.కె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం

నవతెలంగాణ-ముప్కాల్



పోస్టర్లు అతికిస్తున్న నాయకులు

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి మళ్ళీ భారీ మెజారిటీతో వేముల ప్రశాంత్ రెడ్డిని గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి మండల ప్రజలకు, పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలో అభివృద్ధికి ఓటేద్దాం-ప్రశాంత్ రెడ్డిని గెలిపిద్దాం' అనే వాల్ పోస్టర్లను కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. పోస్టర్లను ఆటోలకు అతికించి ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉమా శంకర్, యువజన సంఘం అధ్యక్షులు విఘ్నేష్ గౌడ్, పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రఫీ, సాగర్ గౌడ్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు..

గులాబీమయమైన పట్టణం.. నేడు పెర్కిట్ బైపాస్ నుంచి భారీ ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ అసెంబ్లీ నియోజకవర్గ బి ఆర్ ఎస్ అభ్యర్థిగా మూడవసారి ఆశన్న గారి జీవన్ రెడ్డిని నీ ప్రకటించడంతో నేడు పట్టణంలోని పెర్కిట్ బైపాస్ నుండి అంకాపూర్ వరకు జరిగే ప్రజా ఆశీర్వాద ర్యాలీకి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి గురువారం దగ్గర ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. 2000 కార్లు ,వెయ్యి బైకులతో నిర్వహించి ర్యాలీకి పార్టీ నాయకులు ,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు పట్టణంలోని వివిధ వార్డుల యందు వివిధ కులం సంఘాల ప్రతినిధులతో కలిసి ర్యాలీని విజయవంతం చేయాలని ఆహ్వాన పత్రికలు సైతం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు. పి ఫ్రీ, ఖానాపూర్, గోవింద్ పెట్,



చేపూర్, రాంపూర్, మిర్దాపల్లి, ఆలూరు గ్రామాల సర్పంచులు, సొసైటీల చైర్మన్లు నేటి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

మల్కాపూర్ తాండవాసులకు గంజ్‌లో కూరగాయలు అమ్మే గుర్తింపు కార్డు ఇవ్వాలి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ గంజ్ మార్కెట్లో మల్కాపూర్ తాండలో పండిస్తున్న కూరగాయలను అమ్మే విధంగా గుర్తింపు కార్డు ఇవ్వాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. నిజామాబాద్ రూరల్ క్యాంప్ కార్యాలయంలో టిఎస్ఆర్టిసి చైర్మన్ నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్‌ని మల్కాపూర్ తాండ గ్రామం రైతులు, ఎంపీపీ బానోత్ అనుష ప్రేమ్ నాయక్ ఆధ్వర్యంలో కలిసి శాలువాతో సత్కరించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి మార్కెట్ కమిటీ సెక్రటరీకి లెటర్ రాశారు. కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్,మండల ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వసంతరావు నాయక్, ఉపసర్పంచ్ మోతీ నాయక్, రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న గ్రామస్తులు

పశువులకు ఎఫ్ఎండి వ్యాక్సిన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రంలో గేదజాతి, గోజాతి పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, ఎంపిటిసి-1 గడ్డం గంగారెడ్డి, ఎంపీటీసీ-2, మరియా సతీష్, మండల కో ఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, మండల డాక్టర్ శిరీష, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పేరుతో ప్రజాధనం లూటీ

- ఏలేటీ మల్లికార్జున్ రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్

మిషన్ భగీరథ పేరుతో మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రజాధనం లూటీ చేశారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం ఆయన పర్యటించి స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి ప్రశాంత్ రెడ్డి ఇంటికి కొద్ది దూరంలో ఉన్న గ్రామంలోనే ఇన్ని సమస్యలుంటే నియోజకవర్గంలో ఎన్ని సమస్యలుంటాయో స్పష్టమవుతుందన్నారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మిషన్ భగీరథ వైస్ చైర్మన్ గా ఉన్నప్పుడు ప్రతి ఇంటికి త్రాగునీరు ఇస్తామనిచెప్పి కేవలం ఒక్కటిరెండు రోజులు మాత్రమే నీళ్లు ఇచ్చారన్నారు. కాలనీలో నీటి సమస్య ఉందని స్థానిక ప్రజాప్రతినిధులకు కాలనీవాసులు విన్నవించుకుంటే వారిపైన కోపంతో కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయకుండా వదిలేశారన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

ఎంత చెప్పిన ఎవ్వరు పట్టించుకోవడం లేదని, కాలనీవాసులో స్వంత డబ్బులతో కాలనీలో విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కాలనీలో లేని సమస్య అంటూ లేదని విమర్శించారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. కాలనీలో మురికికాలువలు లేకపోవడంతో మురుగునీరు ప్రవహిస్తుందని తెలిపారు. ఉపసర్పంచ్ ఇందిరమ్మ కాలనీవాసుల తరపున సర్పంచ్ ని నీలదీయగా మంత్రి ప్రశాంత్ రెడ్డి ఆదేశాలతో ఉపసర్పంచ్ చెక్ పవర్ రద్దుచేశారని మండిపడ్డారు. ఇప్పటికి కాలనీలో నీటి సమస్య ఉండటంతో ఉపసర్పంచ్ తన స్వంత డబ్బులతో ట్యాంకర్లతో నీటి సదుపాయం కల్పిస్తున్నారన్నారు. కాలనీలో పైప్ లైన్ వేయించి తాగునీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల కంటే ముందే చేసి చూపుతామని తెలిపారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఇంటింటికి తాగునీరు ఎక్కడ వస్తుందో, ఎన్ని ఇళ్లల్లో వస్తుందో చూపించాలని డిమాండ్ చేశారు. సీసీ రోడ్లు, మురికికాలువలు, విద్యుత్ స్థంబాలు, మంచినీటి వసతులు లేకునా పన్నులు కట్టించుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ఓట్లు అడగడానికి వస్తే తప్పకుండా వారికి తగిన బుద్ధిచెప్తామని స్థానికులు తెలిపారన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్, వెంకటాపూర్ ఉపసర్పంచ్ ప్రశాంత్, మండల అధ్యక్షులు ఏలేటి రమేష్ రెడ్డి, నర్సారెడ్డి, రమేష్, మధు, రమేష్ కాలనీవాసులు, నాయకు పాల్గొన్నారు.

గాంధీ చలన చిత్రాన్ని 17,173మంది విద్యార్థులు వీక్షించారు : డీఇఓ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లాలో గాంధీ చలన చిత్రాన్ని 17,173 మంది విద్యార్థినీ, విద్యార్థులు వీక్షించారని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ నెల 17 నుండి 24 వ తేదీ వరకు జిల్లాలోని 9 సినిమా థియేటర్లలో సినిమా ప్రదర్శించారన్నారు. నంది పేట్, ధర్పల్లి, ఆర్మూర్, భీంగల్ థియేటర్ గాంధీ చలన చిత్రాన్ని జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థినీ విద్యారులు తిలకించారని తెలిపారు. థియేటర్ల యాజమాన్యాలు, పోలీస్ శాఖ, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పాటునందించారని తెలిపారు.

పట్టణంలో ప్రవాస యోజన కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కెద్రంలో క్షత్రియ ఫంక్షన్ హల్ లో బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రవస యోజన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు ధ్యాగ ఉదయ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమనికి ముఖ్య అతిథిగా మహారాష్ట్ర ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆర్మూర్ వ్యక్తికి సంబంధించిన ప్రభుత్వం నడుస్తుంది, అని ఈ అరాచకం అరికట్టేందుకు బీజేపీ కి ఓటు వేయాలని అని అన్నారు. రాకెష్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కి ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా కబ్జా చేస్తూ షాపింగ్ మాల్, వందల ఎకరాల భూములు కొంటున్నాడు అని విమర్శించారు. ప్రశిస్తే అక్రమ కేసులు చేస్తూ ఆనందం పొందుతున్న వ్యక్తి ఎమ్మెల్యే అని అన్నారు. సమావేశంలో ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాలెపు రాజు,అదిలాబాద్ ఇంచార్జి అల్జాపూర్ శ్రీనివాస్,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నుతుల శ్రీను,శివరాజ్ ,బీసీ మోర్చా అధ్యక్షుడు యమాద్రి భాస్కర్,కంచెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు..

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని ముషీర్ నగర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ, ప్రాథమిక పశు వైద్య కేంద్రం సిరికొండ ఆధ్వర్యంలో గురువారం ఆవులకు, గేదెలకు, దూడలకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్టు మండల పశువైద్య అధికారి బాబూరావు కాందారే తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ అభివద్ధి కమిటీ సభ్యులు, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాస్, పశుమిత్రలు పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్

నవతెలంగాణ - వేల్పూర్

మండల కేంద్రంలోని జనకంపెట్, సాహెబ్‌పేట్, పచ్చల్ నడ్కుడ, కొత్తపల్లి, వాడి గ్రామాల్లో హాత్‌సే హాత్ జోడో యాత్రకు కొనసాగింపుగా కాంగ్రెస్ పార్టీని బలపరచండి మానాల మోహన్ రెడ్డిని ఆశీర్వదించండి అంటూ గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు మోహన్ రెడ్డి తరపున బాల్కొండ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నీ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు , నిరుద్యోగ యువకులు తదితరులు పాల్గొన్నారు .

సబ్‌కాసాత్.. సబ్‌కా వికాస్ బిజెపితోనే సాధ్యం

అస్సాం ఎమ్మెల్యే తరంగ గోగోయ్, దినేష్ కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అనే నినాదంతో అభివృద్ధికి నిధులను మంజూరు చేశారని, సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ ఒక బిజెపి తోనే సాధ్యమని, ఈసారి తెలంగాణలో బిజెపి ప్రభుత్వం వస్తుందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని ఆరు నూరైనా నెరవేర్చడానికి ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందని అస్సాం ఎమ్మెల్యే తరంగ గోగోయ్, బిజెపి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇంచార్జి కులచారి దినేష్ కూమార్ అన్నారు.గురువారం ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో మండల స్థాయి కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే తరంగ గోగోయ్, కులచారి దినేష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల అఫిడవిట్‌లో తమకు నివాస గృహాలు లేవని పేర్కొని నేడు ఎన్నో ఇండ్లునిర్మించుకున్నారని పేర్కొన్నారు. గెలిచిన ఆరు నెలల్లోపే మంచిప్ప రిజర్వాయర్ నుండి ప్రతి ఎకరాకు సాగునీరు అందజేస్తానని చెప్పినా ఇప్పటికీ నీరు ఇచ్చింది లేదన్నారు. మండలంలో ఏ ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వకుండా ప్రజలకు మభ్యపెడుతున్నారని ఎద్దేవ చేశారు. కేంద్ర ప్రభుత్వం హదారుల నిర్మాణానికి, బియ్యం, శ్మశాన వాటికలు తదితర వాటికి నిధులు అందజేస్తుందన్నారు. కాగితాల పై ఉన్న నిధులను ముందస్తుగా వారి అకౌంట్లో వేసి పనులు జరిగే విధంగా చూడాలని పేర్కొన్నారు. దళిత బంధు, ఇతర బంధులతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఎ ఒక్క బంధు గ్రామంలో ఎవరికైనా ఇచ్చిన దాఖలలు లేవని దినేష్ కుమార్ మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పలువురు బిజెపితో చేరారు సమావేశంలో బిజెపి ఇందల్ వాయి మండల అధ్యక్షులు నాయుడు రాజన్న, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ ,ఎస్ గంగారాం, ఉపాధ్యక్షులు చిన్ను, జి శ్రీనివాస్, గన్నారం సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సవిత, జగత్ పవర్, అసెంబ్లీ కన్వీనర్ పద్మా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం చేయకండి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం చేయకండని టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆదే ప్రవీణ్ డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అదే ప్రవీణ్ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమంలో మమేకమై పని చేశారని అన్నారు. తెలంగాణ ఏర్పడి 10 సంవత్సరాలు అయినా ఉద్యమకారులకు ఎలాంటి ప్రాతినిధ్యం కల్పించడం లేదని వాపోయారు. ఆర్థికంగా ఆదుకోవడంలో, పథకాలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వయస్సు పైబడుతున్న వారికి పెన్షన్ అందే విధంగా చూడాలని అన్నారు. బీసీలకు జనాభ దామాశా ప్రకారం ఎక్కువ సీట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో మాజీ బీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎ.యస్. పోశెట్టి, జిల్లా నాయకులు ఈర్ల శేఖర్, కోనేరు సాయికుమార్, గిరిధార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లోని

ఉద్యోగ, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దాస్

చలో హైదరాబాద్ పోస్టర్లు ఆవిష్కరణ

కార్మికులందరూ తరలిరావాలని పిలుపు

నవతెలంగాణ-ఆర్మూర్/జక్రాన్‌పల్లి/సిరికొండ

ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 29న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికుల పాల్గొనాలని ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు దాసు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం మండలంలోని అంకాపూర్‌లో గ్రామపంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ, ఉద్యోగ కార్మికులను శాలువాలు కప్పి సన్మానిస్తే సరిపోదని, వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ సఫాయి కార్మికుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి డిమాండ్ చేశారు. దేశంలో 50 కోట్ల మంది కార్మికులు ఉంటే కేవలం ఐదు కోట్ల మందికే సామాజిక చట్టాలు అమలవుతున్నాయని తెలిపారు. కనీస వేతనం 21వేలు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి, మరో దిక్కు కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడడం దుర్మార్గమని అన్నారు. ఉపాధి భద్రత పేరుతో భారత దేశంలో 12 గంటల పని విధానం తీసుకొచ్చిందని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తే చర్చలు జరిపి, సమస్యల్ని పరిష్కరిస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేయడం సరికాదని ఆయన అన్నారు. వేతనం పెంచి, క్రమబద్ధీకరించాలని లేకుంటే కార్మికులు తిరిగి ఉద్యమించవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అంకాపూర్ గ్రామపంచాయతీ సిబ్బంది రవి, లక్ష్మన్న, ఈదుల గంగారాం, భూదేవి పాల్గొన్నారు

జక్రాన్‌పల్లి:కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల అమలుకు కృషి చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) రాష్ట్ర అధ్యక్షులు దాసు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈనెల 29న నిర్వహించే చలోహైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) సొప్పరి గంగాధర్, గోపి ,శేఖర్, రాజన్న, సాయన్న, గంగాధర్ ,గున్నవా, సవీన్ రేణుక ,లక్ష్మి, రాజగంగు, భూదేవి, పోసాని తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడి, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల అమలుకు కృషి చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఎండి ఖాజా మొహినోద్దీన్ పిలుపునిచ్చారు. ప్రచార మండల కేంద్రంలో ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అనంతరం పోస్టర్ల ఆవిష్కరించారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు నర్సింగ్ పల్లి గంగన్న, ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి.పద్మ, జిల్లా నాయకులు వి. బాలయ్య, పూజిత, ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కారల్ మార్క్స్ , ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు నిమ్మల భూమేష్, గడ్కోల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గులాం హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లి: చలోహైదరాబాద్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కార్మికులు